పైపు లైన్‌కు మరమ్మతులు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక నువ్వుల గుంట వీధిలో పగిలిన పైపులైన్‌కు మున్సిపల్ అధికారులు మరమ్మతులు చేపట్టారు. ఆరు నెలలుగా కళ్లెదుటే పైపులైన్ పగిలి తాగునీరు వృథాగా పోతున్న అధికారులు పట్టించుకోలేదు. దీనిపై సోమవారం 'వథాగా పోతున్న తాగునీరు' అంటూ ప్రజాశక్తి ఓ కథనాన్ని వెలుగులోకి తెచ్చింది. దీనిపై మున్సిపల్ ఎఇ సుధాకర్ స్పందించారు. పైపులైన్‌కు మంగళవారం సిబ్బందితో మరమ్మతులు చేయించారు.

పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

బడికి దూరంగా బాల్యం..!

- దుకాణాలు, హోటళ్లు, పరిశ్రమలు, బట్టీల్లో చిన్నారులు
- పేరుకే బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కార్యక్రమం
- పూర్తిస్థాయిలో దృష్టి పెట్టని యంత్రాంగం

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ప్రభుత్వ విధానాల పుణ్యాన నిత్యవసరాలు ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. భారాలు ఎక్కువవుతున్నాయి. సామాన్య, మధ్యతరగతి ప్రజలు కుటుంబాలను పోషించుకునేందుకు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. రెక్కాడితేనే గాని డొక్కాడని అనేక కుటుంబాలు పేదరికంలో మగ్గుతున్నాయి. ఇంటిల్లపాదీ పనులకు వెళితేనే గాని కుటుంబాలను పోషించుకునే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలోనే బాలలు కూడా పనులకు వెళుతున్నారు. వారిని పనులకు వెళ్ళకుండా వారికి కావాల్సిన అవసరాలను తీర్చడంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తుంది. దీంతో పేదరికం విపరీతంగా పెరుగుతోంది. దానికి తోడు బాల కార్మిక వ్యవస్థ అదే రీతిన పెరుగుతూ వస్తుంది.

జిల్లాలో ఎక్కడ చూసినా వందల సంఖ్యలో బాల కార్మికులు దర్శనమిస్తున్నారు. అన్ని పట్టణాలు, గ్రామాల్లో పలువురు బాలకార్మికులు పని చేస్తూ కనిపిస్తున్నారు. ముఖ్యంగా మెకానిక్ షెడ్డులు, హోటళ్లు, పాన్ షాపులు, ఇటుక బట్టీలతో పాటు మద్యం దుకాణాల్లో బాలకార్మికులు కనిపిస్తున్నారు. చివరకు అధికారులు, ప్రజా ప్రతినిధుల ఇళ్లల్లో బాలకార్మికులు పనిచేస్తున్నట్టు అనేక ఘటనలు తేటతెల్లం చేస్తున్నాయి. ఇలా జిల్లా వ్యాప్తంగా వేలాది మంది బాల కార్మికులు ఖార్ఖానుల్లో మగ్గిపోతున్నారు.

పేదరికమే కారణం

ఇంట్లో పేదరికం వలన బడికి వెళ్లి చదువుకుంటూ ఆటపాటలతో గడపాల్సిన బాలబాలికలు పనులకు వెళుతున్నారు. చదువుపై తల్లిదండ్రులకు అవగాహన లేకపోవడంతో పిల్లల్ని బడులకు పంపలేకపోతున్నారు. తక్కువ కూలీ, అరాకొర వేతనం ఇచ్చి ఎక్కువగా పని చేయించుకోవచ్చునని కొందరు యజమానులు తమ వద్ద చిన్నారులను పనులకు పెట్టుకుంటున్నారు. ఇలా కారణం ఏదైతేనే పలకా, బలపం పట్టాల్సిన చిట్టి చేతులు పలుగు, పారలతో పనులకు వెళుతున్నారు.

పెరుగుతున్న వలస కార్మికులు

వలస కార్మికుల సంఖ్య జిల్లాలో ఏటేటా పెరుగుతోంది. కాకినాడ పారిశ్రామిక ప్రాంతం, ఆక్వా చెరువులు, ఇటుక బట్టీల వద్ద వివిధ పనుల నిమిత్తం ఇతర ప్రాంతాల నుంచి వలసలు వస్తున్నారు. అలాంటి కుటుంబాల్లో పిల్లలు బడికి దూరంగా ఉంటూ, వెట్టిచాకిరితో నెట్టుకొస్తున్నారు. పట్టణాల్లో మెటార్ మెకానిక్ షెడ్లలో చాలాచోట్ల బాలకార్మికులు పని చేస్తున్నారు. కాకినాడ పిఆర్ కళాశాల వద్ద ఉన్న ఈట్ స్ట్రీట్‌లో బాల కార్మికులు ఎక్కువగా పని చేస్తున్నారు. వారిని అడ్డుకోవడానికి వివిధ డ్రైవ్‌లు నిర్వహించినా మార్పు కనిపించడం లేదు. గతేడాది కొందరిని పని మాన్పించి, బడిలో చేర్చారు. అయినా ఇంకా అనేక మంది బాలకార్మికులుగానే సాగుతున్నారు. బడికి చేర్చిన వారిలో కూడా కొందరు మళ్లీ పనిబాట పట్టిన దాఖలాలున్నాయి. కుటుంబాల ఆర్థిక అవసరాలు, ఇతర అనేక కారణాలతో బాలకార్మికులుగా పనిచేసుకోవాల్సిన దుస్థితి కనిపిస్తోంది.

అరాకొర చర్యలకే పరిమితం.?

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని అధికారులు చెప్పుకొస్తున్నా క్షేత్ర స్థాయిలో మాత్రం బాల కార్మికులను గుర్తించి వారిని బడికి పంపాలన్న ఆలోచన చేయడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారిక లెక్కల్లో మాత్రం బాలకార్మికుల సంఖ్యను నామమాత్రంగానే చూపుతుండడం శోచనీయం. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు చట్టాలు ఉన్నా అవి సక్రమంగా అమలు కావడం లేదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. దీంతో రేపటి భావి భారత పౌరుల పరిస్థితి హీనంగా మారుతుంది. గత నెల 1 నుంచి 30 వరకూ జరిగిన స్పెషల్ డ్రైవ్‌లో అన్నవరం, కత్తిపూడిలలో ఒక్కొక్కరిని, పిఠాపురంలో ఇద్దరిని 14 ఏళ్ళు లోపు బాల కార్మికులను మాత్రమే గుర్తించారు. ఈ నేపథ్యంలో బాల కార్మికుల గుర్తింపు నామమాత్రంగానే కనిపిస్తుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు గనుక పూర్తిస్థాయిలో చర్యలకు దిగితే ఈ వ్యవస్థ నిర్ములనలో కాస్తయినా మెరుగుదల కనిపిస్తుంది. ఈ నేపథ్యంలో అటు అధికారులు, ఇటు ప్రభుత్వం పూర్తిస్థాయిలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు గంగారాంబాబు

ప్రభుత్వ పథకాలను వర్తింపజేయాలి

ప్రజాశక్తి - కాకినాడ

ఎయిడెడ్ జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న అన్ని పథకాలను వర్తింప చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పిజిఆర్ఎస్ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనాకు ఎస్ఎఫ్ఐ బృందం వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.గంగాసూరిబాబు మాట్లాడుతూ జిల్లాలో అన్నవరంలోని సత్యదేవ జూనియర్ కళాశాల, పెద్దాపురం మహారాణి, కాకినాడలో మల్లాడి సత్య లింగ నాయకర్, సిబిఎం మహిళా జూనియర్ కళాశాలలో పేద, మధ్య తరగతి విద్యార్థులు దాతల సహకారంతో ఏర్పాటైన ఎయిడెడ్ కళాశాలలో విద్యను అభ్యసిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది నుంచి ప్రభుత్వ విద్యా సంస్థలకు ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తుందన్నారు. కానీ ఎయిడెడ్ జూనియర్ కళాశాల విద్యార్థులకు వీటిని అమలు చేయడం లేదన్నారు. కావున ఎయిడెడ్ జూనియర్ కళాశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించాలని, మధ్యాహ్నం భోజనం పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సిహెచ్.సాయిత్, నాయకులు కరుణ, ప్రసాద్, గమినివేలు తదితరులు పాల్గొన్నారు.

అధినేత నిర్ణయమే శిరోధార్యం

ప్రజాశక్తి - శంఖవరం

జనసేన అధినేత పవన్ కల్యాణ్ నిర్ణయమే తనకు శిరోధార్యమని, ఆయన ఎక్కడ నుంచి పోటీ చేయమంటే అక్కడ నుంచే పోటీ చేస్తానని జనసేన పార్టీ నాయకురాలు ముద్రగడ క్రాంతి అన్నారు. సోమవారం సత్యదేవుడిని ఆమె దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు దేవస్థానం ఇఒ వీర్ల సుబ్బారావు స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం ఆమె ప్రసాదం తయారు చేసే విభాగాన్ని సందర్శించారు. ప్రసాదం నాణ్యతపై ఆరా తీశారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రత్తిపాడు మండలం రాచపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శివాలయం విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొనేందుకు వచ్చినట్లు తెలిపారు. ఒకవేళ వచ్చే ఎన్నికల్లో ప్రత్తిపాడు నుంచి పోటీ చేస్తారా? అన్న ప్రశ్నకు ఆమె సమాధానం ఇస్తూ అధినేత ఎక్కడ నుంచి పోటీ చేయమంటే అక్కడ నుంచి పోటీ చేస్తానని అన్నారు. కుటుంబం వేరని, పార్టీ వేరని, తమ అధినేత ఆదేశిస్తే ప్రత్తిపాడులో పోటీ చేసేందుకు సిద్ధమేనని ఆమె స్పష్టం చేశారు. ఈ పర్యటనలో జనసేన నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

సద్యదేవుడిని దర్శించుకుంటున్న క్రాంతి

బాబు ష్యూరిటీతో మోసపోయిన ప్రజలు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

ఎన్నికల ముందు టిడిపి అధినేత చంద్రబాబు ఇచ్చిన బాబు ష్యూరిటీతో రాష్ట్ర ప్రజలు మోసపోయారని మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ అన్నారు. సోమవారం స్థానిక సత్యకృష్ణ కల్యాణ మండపంలో వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వంగ గీత ఆధ్వర్యంలో పిఠాపురం నియోజవర్గ వైసిపి విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బొత్స మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేసేలా కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నామని అన్నారు. ఇచ్చిన హామీలు గుర్తు చేసేందుకు బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నట్లు చెప్పారు. వైసిపి జిల్లా అధ్యక్షులు దాడిశెట్టి రాజా, రాష్ట్ర యువత అధ్యక్షులు జక్కంపూడి రాజా మాట్లాడుతూ కుప్పంను స్వర్ణ నియోజకవర్గంగా తీర్చుదిద్దుతామని ప్రకటించిన చంద్రబాబు ఇప్పటివరకూ 8 సార్లు గెలిచినా ఆయన ఆ పని ఎందుకు చేయాలేదని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని గంజాయి, నకిలీ మద్యంకు కేంద్రగా మార్చేస్తున్నారని, వీధి వీధికి బెల్ట్ షాపులు పెట్టి యువతను తాగిస్తున్నారని విమర్శంచారు. పిఠాపురం నియోజకవర్గంలో సమస్యలను పరిష్కరించేందుకు డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ ఎన్ని రోజులు ఇక్కడ ఉన్నారని నిలదీశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి తోట నరసింహం, వివిధ నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు ముద్రగడ గిరి, దవులూరి దొరబాబు, మాజీ ఎంఎల్‌సి సూర్యనారాయణరాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి నేత బొత్స సత్యనారాయణ

అధికార దండం అందజేస్తున్న బాదం

సేవల్లో అగ్రగామి భీమేశ్వర లయన్స్ క్లబ్

ప్రజాశక్తి - సామర్లకోట

ప్రజలకు సేవలు అందించడంలో సామర్లకోట భీమేశ్వర లయన్స్ క్లబ్ అగ్రగామిగా ఉంటుందని లైన్స్ క్లబ్ మాజీ గవర్నర్ డాక్టర్ బాధం బాలకృష్ణ అన్నారు. లైన్స్‌క్లబ్ భవనంలో జిల్లా మేనేజర్ చిత్తలూరి వీర్రాజు అధ్యక్షతన నూతన కమిటీ అధ్యక్షులు డాక్టర్ అమలకంటి శ్రీనివాసరావు, కార్యదర్శి బడుగు సీతారామరాజు, కోశాధికారి యేలేటి రమేష్ తదితర సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామర్లకోట లయన్స్ క్లబ్ ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు సేవా కార్యక్రమాల్లో ముందుండి మిగిలిన క్లబ్బులకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ప్రస్తుతం క్లబ్ నూతన కమిటీ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలతో ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఇద్దరు మహిళలకు కుట్టు మిషన్లు, ఒక పేద విద్యార్థికి, అనారోగ్యంతో బాధపడుతున్న ఒక మహిళకు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా నూతన కమిటీకి, ప్రస్తుత జిల్లా గవర్నర్ ఈశ్వరకుమార్ దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మొదటి, రెండో వ జిల్లా వైస్ గవర్నర్లు చిట్నీడి శ్రీనివాసరావు, పెద్దిరెడ్డి ఉమామహేశ్వరరావు, పాస్ట్ గవర్నర్ బివిఎన్.రెడ్డి, లయన్స్ నాయ కులు సేపెని సురేష్, మేక శ్రీనివాసరావు, సింగవరపు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సమ్మె జయప్రదం కోరుతూ బైక్ ర్యాలీ

ఈ నెల 9న జరుగుతున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ జిల్లాలోని పలు ప్రాంతాల్లో సిఐటియు, ఇతర కార్మిక సంఘాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం బైక్ ర్యాలీలు నిర్వహించారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

కాకినాడ సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ నగరంలో బైక్ ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీని సిఐటియు జాతీయ ఉపాధ్యక్షురాలు జి.బేబీరాణి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా బేబీరాణి, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.వెంకటేశ్వర్లు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తొకల ప్రసాద్, ఐఎన్‌టియుసి ఎపి, తెలంగాణ ఆర్గనైజింగ్ సెక్రటరీ తాళ్లూరి రాజు, ఎఐసిసిటియు రాష్ట్ర కన్వీనర్ గొడుగు సత్యనారాయణ మాట్లాడారు. జిల్లాలో కార్మికులు, ఉద్యోగులు, మేధావులు, ప్రజాస్వామిక వాదులు సమ్మెలో పాల్గొని మోడీ కార్పొరేట్ అనుకూల, మతోన్మాద విధానాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు, ప్రజాసంఘాల నాయకులు చెక్కల రాజకుమార్, మలకా రమణ, చంద్రమళ్ల పద్మ, మేడిశెట్టి వెంకటరమణ, అంకాడి పద్మావతి, భారతీప్రియ, జ్యోతి, అప్పలస్వామి, వర్మ, తదితరుఉలు పాల్గొన్నారు. అలాగే స్థానిక జిజిహెచ్ వద్ద గేట్ మీటింగ్ ఎపి మెడికల్ ఎంప్లాయిస్ కాంట్రాక్ట్ అండ్ సెక్యూరిటీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగింది. యూనియన్ అధ్యక్షులు కెవి.రామయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ధర్మ, మధు, జాన్‌బాబు, రమణమ్మ, వెంకటేష్, కాటంరాజు తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురం జులై 9న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో పాల్గొంటున్నట్లు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డికి సోమవారం నోటీసును అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి శివకోటి అప్పారావు, సంఘ అధ్యక్షులు వర్రె గిరిబాబు, ఏడిద చిన్ని, దొండపాటి శేఖర్, బంగారు మహేష్, సిఐటియు మండల కార్యదర్శి దారపురెడ్డి క్రాంతికుమార్ పాల్గొన్నారు. అలాగే సిఐటియు ఆధ్వర్యంలో యాసలపు సూర్యారావు భవనం నుంచి బైక్ ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీని యుటిఎఫ్ పూర్వపు రాష్ట్ర కార్యదర్శి జి.ప్రభాకరవర్మ జండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు గడిగట్ల సత్తిబాబు, క్రాంతికుమార్, నాయకులు దాడి బేబీ, పద్మావతి, వడ్డి సత్యనారాయణ, తైనాల శ్రీను, తాడిశెట్టి గంగ, కూనిరెడ్డి అప్పన్న పాల్గొన్నారు.

కాజులూరు మండలంలోని పల్లిపాలెం, కోలంక, కుయ్యేరు, దుగ్గుదూరు గ్రామాల్లో ఎపి కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రాజశేఖర్, వల్లు రాజబాబు పర్యటించారు. కౌలు రైతులు, ఉపాధి హామీ కూలీలను కలుసుకుని సార్వత్రిక సమ్మెలో భాగాస్వాములు కావాలని కోరారు. కూలీలకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నందికోళ్ల సత్తిబాబు, దవులూరి సత్యారావు, చల్లా సత్తిబాబు, రాయుడు రవి, కనుమూరు చంద్రరావు, ఇతర కౌలు రైతులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం సిపిఎం, సిఐటియు, ఎఐసిసిటియు ఆధ్వర్యంలో ఏలేశ్వరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి పాకలపాటి సోమరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు జ్యోతుల సత్తిబాబు, పిల్లా రాంబాబు, ఏగుపాటి అర్జున్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి భవన నిర్మాణ కార్మికులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి కె.చిన్న మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరబాబు, డి.సత్యనారాయణ, ఎం.సూరిబాబు, గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ రూరల్ వలసపాలకలలోని సిఐటియు కార్యాలయంలో సార్వత్రిక సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు రూరల్ మండల కార్యదర్శి తొట్టిపూడి రాజా, సీనియర్ నాయకులు చింతపల్లి అజయ్‌కుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వివిధ పరిశ్రమల కార్మికులు శ్రీహరి, బలరాం, రాంబాబు, సంగీతరావు, రాజు, శ్రీను, నూకరాజు, సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెకు సిపిఎం మద్దతు

ఈ నె 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సిపిఎం రూరల్ కమిటీ మద్దతు ఇస్తున్నట్లు రూరల్ కార్యదర్శి తిరుమలశెట్టి నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు అమలు జరిగితే ఉద్యోగ, కార్మిక, కర్షకులకు తీవ్రంగా నష్టపోతారని అన్నారు. కార్మికులు సమిష్టిగా మెమోరాండం సమర్పించినా దాన్ని కూడా ఆర్గనైజ్డ్ క్రైం గా పరిగణించే చట్టాలు కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను యావత్ కార్మిక వర్గం, శ్రమజీవులు తిప్పి కొట్టాలన్నారు.

కాకినాడలో బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న బేబీరాణి

కాజులూరులో కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

ఏలేశ్వరంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

పెద్దాపురంలో ర్యాలీని ప్రారంభిస్తున్న యుటిఎఫ్ నేత వర్మ

పిఠాపురంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

కార్టూ'నిజం'



పైప్‌లైన్ కోసం తవ్వారు..పూడ్చడం మరిచారు

ప్రజాశక్తి - పెద్దాపురం

పట్టణ పరిధిలో భాగ్యనగర్ గ్యాస్ కంపెనీ ప్రయివేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఇంటింటికి గ్యాస్ సరఫరా కోసం పట్టణ పరిధిలో రహదారులు తవ్వారు. ఈ తవ్విన రహదారులలో అధిక శాతం సిమెంట్ రోడ్లు, సిమెంట్‌తో తీర్చిదిద్దుకున్న వాకిళ్లు ఉన్నాయి. మున్సిపాలిటీలో గోతులు తవ్వి పైపులైన్ ఏర్పాటు నిమిత్తం దరఖాస్తు చేసుకోగా 51 కిలోమీటర్ల మేర పైపులైను నిర్మాణానికి గోతులు తవ్వేందుకు మున్సిపాలిటీ అనుమతి ఇచ్చింది. అయితే సుమారు 6 నెలలు కితం గోతులు తవ్వారు. గోతులు తవ్వి పైపులైన్ వేసిన తర్వాత ఆ గోతులను పూడ్చి యథావిధిగా సిమెంటు రోడ్డు వేయాలి. అయితే అక్కడక్కడ సిమెంట్‌తో పూడ్చి మిగిలింది ఎక్కడిదక్కడ వదిలేశారు. తవ్విన గోతుల్లో మట్టిని పూడ్చి వదిలేయడంతో ఆయా నివాస ప్రాంతాల ప్రజలు మట్టి, బురదతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ అవస్థలు పడలేక కొంతమంది తమ సొంత డబ్బుతో పూడ్చిన గోతులపై సిమెంటుతో పూడ్చి వేసుకున్నారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఇదే అంశంపై కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దానిపై అధికారులు వివరణలు ఇచ్చారు. అయితే ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆ సంస్థ గోతులను పూడ్చిన పరిస్థితి లేదు. నెలలు గడుస్తున్నా సంబంధిత గ్యాస్ కంపెనీ నుంచి స్పందన కరువయింది. పట్టించుకోవాల్సిన మున్సిపల్ అధికారులు సైతం మిన్నకుండిపోయారు. దీంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు.

గోతులను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

గోతులను పరిశీలించిన సిపిఎం బృందం

వరహాలయ్య పేటలో గోతులను సిపిఎం నాయకులు నీలపాల సూరిబాబు, సిరపరపు శ్రీనివాస్, దారపురెడ్డి కృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తీసిన గోతులను తక్షణమే సిమెంట్‌తో పూడ్చాలని డిమాండ్ చేశారు. గ్యాస్ కంపెనీ నుంచి నష్టపరిహారం వసూలు చేయాలని కోరారు.

పాడా పీడీతో మాట్లాడుతున్న ఐద్వా నాయకులు

డ్రెయినేజీ సౌకర్యం కల్పించాలని వినతి

ప్రజాశక్తి - పిఠాపురం

స్థానిక అగ్రహారం కరెంట్ ఆఫీస్ సమీపంలోని ఇళ్ళ వద్ద డ్రెయినేజీ సౌకర్యం కల్పించాలని పాడా పిడీ చైత్రవర్షిణికి భారత ప్రజా తంత్ర మహిళా సంఘం(ఐద్వా)ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐద్వా నాయకులు కె.మణి మాట్లాడుతూ గతంలో అనేక దఫా లు డ్రెయినేజీ నిర్మాణం, బైపాస్ రోడ్డు ఆనుకొని ఉన్న గృహాలకు వ్యక్తిగత కుళాయి కనెక్షన్లు మంజూరు చేయాలని వినతిపత్రాలు అందించినట్లు తెలిపారు. కానీ నేటికీ ఆయా సమస్యలు పరిష్కారం కాలేదని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణం ఆయా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అపర్ణ, వి.నాగు పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్‌కు 46 అర్జీలు

పాడా కార్యాలయంలో నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో వివిధ సమస్యలపై 46 అర్జీలు అందాయి. పాడా పీడీ చైత్రవర్షిణి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు.

ఫణిశ్రీధర్‌కు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఫణిశ్రీధర్ గీతం యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ సాధించారు. ప్రొఫెసర్ డాక్టర్ పివి.లక్ష్మి నేతృత్వంలో ఫణిశ్రీధర్ సమర్పించిన సిటి స్కాన్ ఇమేజ్ వర్గీకరణ కోసం డీప్ లెర్నింగ్ మోడల్ యొక్క మెరుగైన పనితీరు' అనే అంశంపై డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పొందారు. డాక్టర్ ఫణిశ్రీధర్ భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, ప్రో.ఛాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి ఆకాంక్షించారు. డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, వైస్ ఛాన్సలర్లు ప్రో ఎంబి.శ్రీనివాస్, డాక్టర్ ఎస్.రమాశ్రీ, డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, రిజిస్ట్రార్ డాక్టర్ జి.సురేష్ అభినందనలు తెలిపారు.

డాక్టర్ ఫణిశ్రీధర్

ఎంఎంసి డైరెక్టర్‌కు సన్మానం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని జి.రాగం పేటకు చెందిన జలధాని సుబ్రహ్మణ్యం పెద్దాపురం ఎంఎంసి డైరెక్టర్‌గా ఎన్నికైన సందర్భంగా ఎపి, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల కరికాల భక్త సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పశ్చిమగోదావరి జిల్లా వేల్పూర్ గ్రామం లో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయనను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మూడు రాష్ట్రాల ప్రతినిధులు ప్రతినిధులు పాల్గొన్నారు.

శ్రీనివాసరావును సత్కరిస్తున్న ప్రతినిధులు

నేరాలు ఘోరాలు

రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ముగ్గురు అరెస్ట్

ప్రజాశక్తి - కొవ్వూరు

పట్టణంలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశామని పౌర సరఫరాల శాఖ డిటి టి.సునీత తెలిపారు. కొవ్వూరు టోల్ గేట్ సమీపంలో మూడు బైకులపై అక్రమంగా తరలిస్తున్న 500 కేజీల పిడిఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిత్యవసర సరుకుల నియంత్రణ చట్టం 6ఎ కింద కేసు నమోదు చేశామన్నారు. స్వాధీనం చేసుకున్న మూడు బైకులను పట్టణ పోలీసులకు అప్పగించామన్నారు. రేషన్ బియ్యం కొనుగోలు చేసినా, అమ్మినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రావులపాలెంలో...

అక్రమంగా తరలిస్తున్న మూడు టన్నుల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం గోపాలపురం హైవే పైన నిఘా కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వాహన తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు అందిన సమాచారం మేరకు నరసాపురం నుంచి రావులపాలెం వైపు వస్తున్న మినీ వ్యాన్ ను తనిఖీ చేశారు. ఈ వ్యాన్లో 60 బస్తాలు, మొత్తం 3 టన్నుల బియ్యం ఉండటాన్ని గుర్తించారు. ఈ బియ్యాన్ని సరైన ఆధారాలేకుండా అక్రమంగా తరలిస్తున్న కారణంగా అధికారులు వ్యాన్‌ను స్వాధీనం చేసుకుని, డ్రైవర్‌తో పాటు సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసి స్థానిక పోలీస్ స్టేషన్ కి అప్పగించారు. తనిఖీల్లో విజిలెన్స్ సిఐ మధుబాబు, డిసిటిఒ నవీన్ కుమార్, రావులపాలెం ఎంఎస్ఒ పి.వెంకటేశ్వరరావు, వి ఆర్ఒ వి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

పట్టణ శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఎనిమిది మంది వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ.22,590 నగదును స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు.**జగ్గంపేట:** మండలంలోని మన్యంవారిపాలెం శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఎస్ఐ రఘునాథరావు, సిబ్బంది దాడి చేసి నలుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.5150 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సిఐ వైఆర్‌కె. శ్రీనివాస్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - నిడదవోలు రూరల్

మండలంలోని తాడిమల్ల శివారు బోనం రామకృష్ణకు చెందిన కొబ్బరి తోటలో గుర్తు తెలియని వ్యక్తి ఉరివేసుకుని అనుమానాస్పదంగా మృతి చెందాడని సమిశ్రగూడెం ఎస్ఐ ఎల్.బాలాజీసుందర్‌రావు తెలిపారు. సోమవారం ఉదయం తోటలో కూలీలు పనిచేస్తుండగా చెట్టుకు వేలాడుతున్న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారన్నారు. వెంటనే వారు అధికారులకు సమాచారం ఇచ్చారని తెలిపారు. విఆర్ఒ కె.గంగాజలం ఘటనా ప్రాంతాన్ని పరిశీలించి, పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. ఉరి వేసుకున్న వ్యక్తి వయస్సు 50ఏళ్లు ఉండొచ్చని తెలిపారు. నిక్కర్ ధరించి ఉన్నాడని తెలిపారు. మృతి చెంది వారం రోజులు కావొచ్చున్నారు. విఆర్ఒ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

క్రమశిక్షణ అవసరం

ప్రజాశక్తి - పెద్దాపురం

విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ, సత్ప్రవర్తన అలవర్చుకోవాలని సిఐ విజయశంకర్ అన్నారు. సోమవారం మండలంలోని దివిలి కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎస్ఐ వి.మౌనిక అధ్యక్షతన విద్యార్థులకు మత్తు పదార్థాల అనర్థాలు, క్రమశిక్షణ, నేర రహిత జీవిత విధానాలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నాయన్నారు. మత్తు పదార్థాలు, డ్రగ్స్‌కు దూరంగా విద్యార్థులు ఉండాలన్నారు. వాహనాలు నడపడంలో నిబం ధనలు,, జాగ్రత్తలు పాటించాలన్నారు. క్రమశిక్షణ, సత్ ప్రవ ర్తన ద్వారా ఉన్నత విద్యావంతులుగా అభివృద్ధి చెందాలన్నారు. మహిళల రక్షణ కోసం ఉన్న చట్టాలను వివరించారు.

ఆర్‌డిఒకు రైతుల వినతి

ప్రజాశక్తి - మామిడికుదురు

వాడబోది డ్రెయిన్ ద్వారా వస్తున్న ఉప్పు నీటి వల్ల పంటలు నష్టపోతున్నామని డ్రెయిన్ ఆధునీకికరణకు చర్యలు తీసుకుని శాశ్వత పరిష్కారం చూపాలని పాశర్లపూడి, పాశర్లపూడిలంక రైతులు అన్నారు. ఈ సందర్భంగా సోమవారం అమలాపురం ఆర్‌డిఒ కె. మాధవికి రైతులు వినతి పత్రం అందజేశారు. ఒయన్‌జిసి రోడ్ల వల్ల నష్టపోతున్నామని వినతి పత్రంలో పేర్కొన్నారు దీనిపై ఒఎన్‌జిసి అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు ఈ వినతి పత్రం అందించిన రైతు లు కోలా సత్యనారాయణ, వేగి లక్ష్మీనారాయణ, రాయపురెడ్డి శీను, గంధం స్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - కొత్తపేట

అమలాపురం రోటరీ క్లబ్ యాజమాన్యం ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో కొత్తపేట విద్యార్థులు జూనియర్ కేటగిరిలో అమ్మాయిల్లో బండారు శ్రావణి, అబ్బాయిల్లో జూనియర్ కేటగిరిలో నల్లా ప్రవీణ్ ప్రథమ స్థానం సాధించినటు డాక్టర్ యోగా శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్ట్ నెలలో ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి యోగా పోటీలకు అర్హులైనట్టు తెలిపారు.

పెరిగిన కూరగాయల ధరలు

ప్రజాశక్తి - అయినవిల్లి

పెరుగుతున్న కూరగాయ ధరలతో సామాన్యులు అల్లాడిపో తున్నారు పది రోజులుగా పెరుగుతున్న ధరలతో మార్కెట్ ధరల బోర్డ్ రేట్లు సాధారణం కంటే రెట్టింపునకు చేరుకున్నాయి. రైతు మార్కెట్లో కేజీ రూ.40 గా విక్రయించబడుతున్న టమాటా ధర రిటైల్ మార్కెట్లో రూ.50 నుంచి రూ. 60 పలుకుతోంది.

ట్రాఫిక్ సమస్యతో ప్రయాణికుల సతమతం

ప్రజాశక్తి - రౌతులపూడి

రౌతులపూడిలో ట్రాఫిక్ సమస్యతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు నిత్యం రౌతులపూడికి రాకపోకలు సాగిస్తుంటారు. అయితే లెటర్ రైట్ వాహనాలు, నల్లరాతి క్వారీలు రవాణాతో ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గతంలో ఎస్.పైడిపాల, గుమ్మరేగుల, తదితర గ్రామాల నుంచి లెటర్ రైట్, నల్లరాతి క్వారీలు గిడజం మీదుగా తేటగుంటకు చేరుకునేవి. అయితే తేటగుంట గ్రామస్తులు ఈ వాహనాల రవాణాను అడ్డుకున్నారు. దీంతో ఆయా గ్రామాల నుంచి వస్తున్న భారీ వాహనాలు రౌతులపూడి మీదుగా కత్తిపూడి వెళ్లి అక్కడ నుంచి వివిధ ప్రాంతాలకు తరలివెళ్తున్నాయి. దీంతో రౌతులపూడిలో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమైంది. భారీ వాహనాల రాకపోకలు, మితిమీరిన వేగంతో రోడ్లపైకి రావాలంటే ప్రజలు భయపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. విద్యా సంస్థల పని చేసే సమయాల్లోనైనా భారీ వాహనాల రాకపోకలను నియంత్రణ చేయాలని ప్రజలు కోరుతున్నారు. రౌతులపూడి నుంచి కత్తిపూడి వెళ్లే రహదారి మధ్యలో 3 వంతెనలు శిథిలావస్థకు చేరుకున్నాయి. సుమారు 50 టన్నుల బరువుతో భారీ వాహనాలు రవాణా సాగిస్తుండడంతో శిథిలావస్థలో ఉన్న ఆ వంతెనలు ఏ సమయంలో కూలిపోతాయోనన్న ఆందోళన ప్రయాణికుల్లో వ్యక్తం అవుతుంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి భారీ వాహనాల రాకపోకలపై నియంత్రణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

భారీ లారీ రాకతో ట్రాఫిక్‌లో చిక్కుకున్న ప్రయాణికులు

గందర గోళంగా గాడిమొగ గ్రామసభ

ప్రజాశక్తి - తాళ్లరేవు

ప్రజా సమస్యలు తెలుసుకుని వాటికి అనుగుణంగా ప్రణాళిక తయారు చేయడానికి సోమవారం గాడిమొగ గ్రామపంచాయతీలో నిర్వహించిన గ్రామ సభ గందరగోళంగా మారింది. గ్రామ సర్పంచ్ కామాడి గోవలక్ష్మి అధ్యక్షతన జరిగిన గ్రామసభలో పంచాయతీ కార్యదర్శి రమణమ్మ పంచాయతీలో వివిధ విభాగాలలో అందుబాటులో ఉన్న నిధులు వివరాలను తెలిపారు. వివిధ విభాగాల అధికారులు మాట్లాడారు. ఈ సందర్భంగా 2వ వార్డు సభ్యుడు పోతాబత్తుల రాంబాబు మాట్లాడుతూ గ్రామంలో అంగన్‌వాడీ భవన ప్రారంభోత్సవం సభలో ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు చేసిన వ్యాఖ్యలపై అభ్యంతరం తెలిపారు. పాలకవర్గం సక్రమంగా పనిచేయకపోవడం వల్లే అభివృద్ధి ఆగిందని అనడం సరికాదన్నారు. గతంలో పంచాయతీ అభివృద్ధిపై జరిగిన చర్చలో జూన్ 26వ తేదీ లోపు కేసులు తీసివేసే బాధ్యత తనదంటూ ఎంఎల్ఎ చెప్పారని అన్నారు. ఆ సమయం దాటినా కేసు తీసివేయకపోగా పాలకవర్గంపై మాట్లాడడం ఏమిటని ప్రశ్నించారు. దీనిపై మాజీ ఎంపిటిసి మల్లాడి వరదరాజు, కామాడి మాతరాజు అభ్యంతరం వ్యక్తం చేయడంతో సభలో గందరగోళం నెలకొంది. పాలకవర్గం అభివృద్ధికి అడ్డుపడుతూ ఎంఎల్ఎను ప్రశ్నించడం సరికాదన్నారు. ఉప సర్పంచ్ కొక్కిలిగడ్డ లోకేష్ మాట్లాడుతూ పాలకవర్గం పనిచేయకపోతే రూ.4 కోట్ల అభివృద్ధి పనులు ఎలా జరిగాయని ప్రశ్నించారు. దీంతో సభలో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. పోలీసులు రంగ ప్రవేశం చేసి పరిస్థితిని చక్కదిద్ది తిరిగి సమావేశ పరిచారు. అయినా నాయకుల్లో మార్పు రాకపోవడంతో తీవ్ర గందరగోళం మధ్య సమావేశం ముగిసినట్లు సర్పంచ్ గోవలక్ష్మి ప్రకటించారు. గ్రామ పంచాయతీ పాలకవర్గం తీరు మారకపోతే పంచాయతీ నిధులు జిల్లా కలెక్టర్ ద్వారా వినియోగించేలా ఎంఎల్ఎ చర్యలు తీసుకుంటారని టిడిపి నాయకులు స్పష్టం చేశారు. స్థానిక ప్రజలు, పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్ పనులు ప్రారంభం

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని బలరామపురం గ్రామానికి 24 గంటలు విద్యుత్ సదుపాయం కల్పించే విద్యుత్ లైన్ పనులను సోమవారం ప్రారంభించారు. ఇటీవల గ్రామంలో పర్యటించిన ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభకు గ్రామంలో నెలకున్న విద్యుత్ సమస్యను ఎంపిటిసి శ్రీసోమరౌతు రవి, సర్పంచ్ పైల సీత, స్థానిక టిడిపి నాయకులు వివరించారు. దీంతో ఆమె విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడారు. ఈ నేపథ్యంలోనే ఆర్‌డిఎస్ఎస్ పథకంలో 24 గంటలు విద్యుత్తు సదుపాయం కల్పించేలా అధికారులు విద్యుత్ లైన్‌ను నిర్మించే పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభకు సర్పంచ్ పైల సీత, ఎంపిటిసి శ్రీసోమరౌతు రవి, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.



విద్యుత్ లైన్‌ను వేస్తున్న సిబ్బంది

సుపరిపాలనలో తొలి అడుగు

ప్రజాశక్తి - పెద్దాపురం

వ ట్ట ణ ం లో ని 21, 22 వార్డులు, మండల పరిధిలో కాండ్రకోటలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వమించారు. పట్టణ పరిధిలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబురాజు ఆధ్వర్యంలో జరిగింది. కాండ్రకోటలో క్లస్టర్ ఇన్‌ఛార్జ్ ఎలిశెట్టి నాని ఆధ్వర్యంలో సాగింది. ఈ కార్యక్రమాల్లో టిడిపి నాయకులు కాకినాడ రామారావు, రంది సత్యనారాయణ, గడ్డం పెదకాపు, మహమ్మద్ ఆరిఫ్ ఆలీ, టిడిపి గ్రామ అధ్యక్షులు బాబిశెట్టి గొల్లబాబు, ఎలిశెట్టి ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలను పంపిణీ చేస్తున్న టిడిపి శ్రేణులు

పథకాలు సద్వినియోగమయ్యేలా కృషి

ప్రజాశక్తి - సామర్లకోట

ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు, విద్యార్థుల సర్వతోముఖ అభివద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు సద్వినియోగం అయ్యేలా కృషి చేయాలని జిల్లా విద్యా శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎండి.షరీఫ్ కోరారు. సోమవారం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌ను సందర్శించారు. మిడ్డే మీల్స్ అమలు తీరుపై ఆరా తీశారు. అలాగే విద్యామిత్ర కిట్ల పంపిణీపై హెచ్ఎం తోటకూర సాయి రామకృష్ణను అడిగి తెలుసుకున్నారు. ఈనెల 10న నిర్వహించే మెగా పేరెంట్ మీట్‌కు హాజరుకావాలని హెచ్ఎం ఆయనను కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న షరీఫ్

బాలల హక్కులపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - పిఠాపురం

స్థానిక జగ్గయ్యచెరువులోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బాలల హక్కులపై అవగాహన సదస్సును నిర్వహించారు. సోమవారం జరిగిన ఈ సదస్సుకు సిడిపిఒ సిహెచ్‌కె.దుర్గాదేవి అధ్యక్షత వహించారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి బాలల హక్కులు, లైంగిక వేధింపులు, మంచి, చెడు స్పర్శలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు-చట్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు వెంకటలక్ష్మి, నాగమణి పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న కౌన్సిలర్

దోమల నిర్మూలనకు విస్తృత చర్యలు

ప్రజాశక్తి - పెద్దాపురం

పట్టణ పరిధిలో దోమల నిర్మూలనకు విస్తృత చర్యలు చేపట్టామని బోధ నివారణ కేంద్రం హెల్త్ ఇన్‌స్పెక్టర్ ఐ.సువర్ణరాజు తెలిపారు. సోమవారం స్థానిక శోభా థియేటర్ వీధిలో చేపట్టిన దోమల లార్వా నిర్మూలన చర్యలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురుగునీటి కాలువలు, నివాస ప్రాంతాలు, గృహాల్లో నీటి నిల్వల వల్ల దోమల సంతతి పెరుగుతుందన్నారు. దోమల వల్ల ఫైలేరియా, మలేరియా, డెంగీ వంటి రోగాలకు ప్రజలు గురవుతారన్నారు. నీటి నిల్వల వద్ద లార్వా నిర్మూలనకు మందులు పిచికారి చేస్తున్నారన్నారు. ప్రజలు నీటి నిల్వలు లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫైలేరియా హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నీటి తొట్టెలో నిల్వ నీటిని తొలగిస్తున్న సిబ్బంది

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - తాళ్లరేవు

సమస్యలను పరిష్కరించాలని పలు గ్రామాల మహిళలు ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజును కోరారు. సోమ వారం ఆయన మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా తాళ్ళరేవు పంచాయతీ రచ్చవారిపేట ఏటిగట్టుకు ర్యాంపుతో పాటు మెట్లు నిర్మించాలని, రహదారి, డ్రెయినేజీ సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నామని, అంగన్‌వాడీ భవనం నిర్మించాలని పలువురు మహిళలు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్రేయ పాయ ఏటిగట్టుకు సరిహద్దులు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటా మన్నారు. ఇంటింటికి రేషన్ రావడంలేదని, దీనివల్ల స్థానిక డీలర్ వద్ద గంటల కొద్ది వేచి ఉండాల్సి వస్తుందని ప్రతాప్ నగర్‌లో వృద్ధ మహిళలు తెలిపారు. వృద్ధులకు ఇంటికి రేషన్ అందేలా చర్యలు తీసుకోవాలని స్థానిక అధికారులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ చెల్లి వివేకా నంద, నాయకులు గుత్తుల సాయి, టేకుమిడి లక్ష్మణరావు, పొన్నమండ రామలక్ష్మి, వాడ్రేవు వీరబాబు, కట్టా త్రిమూర్తు లు, వి.శ్రీనివాసరావు, ఎన్.వినోద్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను తెలుసుకుంటున్న ఎంఎల్ఎ దాట్ల

బాలల సంక్షేమం, సంరక్షణపై శిక్షణ

ప్రజాశక్తి - పెద్దాపురం

బాలల సంక్షేమం, సంరక్షణ అందరి బాధ్యతని ఎంపిడిఒ డి.శ్రీలలిత అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సిడిపిఒ జి.ఉష అధ్యక్షతన గ్రామస్థాయి బాలల సంక్షేమం, పరిరక్షణ కమిటీ అధికారులకు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల రహిత సమాజాన్ని తీర్చిదిద్దేందుకు అందరు కృషి చేయాలన్నారు. బాలల స్నేహపూరిత కమిటీలను అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి సిహెచ్.వెంకటరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, కాండ్రకోట పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ చంద్రకిరణ్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా సంరక్షణ కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

ప్రజాశక్తి - కాజులూరు

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపిడిఒ జె. రాంబాబు సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా మండలంలోని 26 గ్రామాలకు 500 కొబ్బరి మొక్కలు రావడం జరిగిందని అన్నారు. వీటిని ఫీల్డ్ అసిస్టెంట్ల ద్వారా ఉపాధి కూలీలుచే నాటించాలని తెలిపారు. ప్రజలకు, రైతులకు ఇబ్బంది కానీ ప్రదేశాల్లో నాటించినట్లయితే వాటిని పరిరక్షించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ మొక్కల ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం చేకూరుతుందన్నారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

భోజనాన్ని పంపిణీ చేస్తున్న జ్యోతుల నవీన్

అన్న క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద సోమవారం నిర్వహించిన అన్న క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం నిర్వహించారు. గండేపల్లి మండలం కె.గోపాలపురం గ్రామానికి చెందిన టిడిపి సమన్వయ కమిటీ సభ్యులు అవసరాల బాలసుబ్రహ్మణ్యం ఆర్థిక సాయంతో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మారిశెట్టి భద్రం, అడబాల భాస్కరరావు, బద్ది సురేష్, దేగల సత్తిబాబు, పీలా మహేష్ పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళాలు

ప్రజాశక్తి - పెద్దాపురం

మరిడమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న అన్న దానానికి కాకినాడకు చెందిన పైండా భీమేశ్వరరావు దంప తులు సోమవారం రూ.50,001 విరాళాన్ని అందజేశారు. అలాగే పెద్దాపురం పట్టణానికి చెందిన చలపాక రామకృష్ణ రూ.10,116 విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమానికి ముందు వారు అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో అధికారులు సత్కరించారు. అమ్మవారి తీర్థ ప్రసాదాలను, చిత్రపటాలను అందజేశారు.

యానాం వార్తలు

ఆందోళన చేస్తున్న మున్సిపల్ ఉద్యోగులు

బకాయి వేతనాల కోసం ఆందోళన

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి వ్యాప్తంగా మున్సిపల్ ఉద్యోగులు తమ బకాయి వేతనాలు చెల్లించాలని నిరసన చేపట్టారు. ఈ మేరకు సోమవారం యానాంలో స్థానిక ప్రాంతీయ పరిపాలనాధికారి కార్యాలయం సమీపంలో జెండా స్తంభం వద్ద యానాం పురపాలక ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ ఉద్యోగులు తమ బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జీతాలు లేక తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ముఖ్యమంత్రి రంగస్వామి తమకు ప్రకటించిన ప్రత్యేక ప్యాకేజీ నిధులు విడుదల చేయాలన్నారు. ఈ సందర్భంగా చెల్లి గోపి మాట్లాడుతూ మున్సిపాలిటీలో ఉద్యోగులంతా ఇన్‌ఛార్జులుగా నియమిస్తున్నారని పూర్తిస్థాయి సిబ్బంది నియమించకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. గత ఏనిమిది సంవత్సరాల నుంచి జీతాల కోసం ఇబ్బంది పడుతున్న ఏ ఒక్క అధికారి కూడా సమస్యను పరిష్కారం చూపడం లేదన్నారు. సానిటరీ వర్కర్లకు పనిముట్లు ఇవ్వకుండా భద్రతా ప్రమాణాలు పాటించకుండా పనిచేయమనడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. విశ్రాంత ఉద్యోగుల బకాయి వేతనాలు కూడా చెల్లించాలన్నారు. పుదుచ్చేరి ప్రభుత్వం తక్షణమే స్పందించి జీతాలు ఇచ్చే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

చిత్తడిగా మారిన రహదారి

గుంతలమయంగా రహదారులు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

మండలంలో పలు గ్రామాల్లో రహదారులు గుంతల మయంగా మారాయి. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఒమ్మంగి-ఉత్తరకంచి ప్రధాన రహదారి భారీ గోతులతో దర్శనమిస్తుంది. ఉత్తరకంచి గ్రామం నుంచి ఏజెన్సీ గ్రామాలకు, పెద్దిపాలెం ప్రభుత్వ ఆసుపత్రికి ప్రతీరోజు వందలాదిగా ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. రహదారిపై అడుగడుగునా గుంతలు ఉండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వాహనదారులైతే ఆ గోతుల్లో ప్రమాదవశాత్తు పడి గాయాలపాలౌతున్నారు. ఉత్తరకంచి నుంచి పెద్దిపాలెం గ్రామానికి రహదారి నిర్మాణం చేయకపోవడంపై స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రహదారికి ఇరువైపులా ఆక్రమణలు తొలగించకపోవడం వల్లే రోడ్డు నిర్మాణం పూర్తి కావడం లేదనే వాదనలు విన్పిస్తున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలను దృష్టిలో పెట్టుకుని తాత్కాలికంగానైన మరమ్మతు పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రాష్ట్రాన్ని కొల్లగొడుతున్న కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

మట్టి, మైనింగ్ ద్వారా రాష్ట్రాన్ని కూటమి ప్రభుత్వం కొల్లగొడుతుందని వైసిపి మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి సోమవారం ఒక ప్రకటనలో దుయ్యపట్టారు. కూటమి ప్రభుత్వం రోజురోజుకు అవినీతిమయంలో కూరుకుపోతూ.. అక్రమ పరిపాలన కొనసాగిస్తుందని విమర్శంచారు. ఇందుకు ఉదాహరణే విజయవాడ రూరల్ కొత్తూరులో 150 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువులో మట్టిని తవ్వుకుపోవడమని అన్నారు. భారీ యంత్రాలతో పగలు రాత్రి తేడా పెద్ద గుంతలతో మట్టిని తవ్వుకుపోతున్నారని అన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని క్షమించరని అన్నారు. వైసిపి పాలనలో కేంద్రం మెడికల్ కాలేజీలకు అనుమతులు ఇస్తే, నేటి కూటమి ప్రభుత్వం తమ వద్ద ఆయా కళాశాల ఏర్పాటుకు సౌకర్యాలు లేవని ప్రయివేటుపరం చేసేందుకు సిద్ధపడటం దారుణమన్నారు.

ఆల్కహాల్ ఉత్పత్తులు విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి - గొల్లప్రోలు, గండేపల్లి

పాఠశాల, కళాశాలల వద్ద దుకాణాల్లో పొగాకు మరియు ఆల్కహాల్‌కు సంబంధించిన ఉత్పత్తులు విక్రయిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ ఎన్.రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. పట్టణ, గ్రామాల్లో ఎక్కడైనా నిషేధిత మాదకద్రవ్యాలు అమ్మడం, సేవించడం వంటివి జరిగిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. అలాగే గండేపల్లి మండలంలోని విద్యా సంస్థల పరిధిలోని దుకాణాల్లో ఎటువంటి మత్తు పదార్థాలను విక్రయించినా చట్టప్రకారం చర్యలు తప్పవని ఎస్ఐ శివనాగు ఒక ప్రకటనలో హెచ్చరించారు. గ్రామాల్లో ఎవ్వరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు గ్రహిస్తే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో తెలియచేయాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు.

పాడు బడిన ఇంటితో ఇబ్బందులు

ప్రజాశక్తి - తాళ్లరేవు

తమ ఇంటికి ఎదురుగా ఉన్న పాడు పడ్డ ఇంటి వల్ల ఇబ్బందులు పడుతున్నామని మండలంలోని పి.మల్లవరం పంచాయతీ పత్తిగొంది గ్రామానికి చెందిన మొగలతుర్తి శ్రీనివాసరావు సోమవారం పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామంలో రెడ్నం వీరప్రసాద్‌కు చెందిన ఇళ్లు చాలా కాలంగా ఖాళీగా ఉండటంతో శిథిలావస్థకు చేరిందన్నారు. పాడుబడిన ఇంటిలోకి పాములు, క్రిమి కీటకాలు చేరడంతో చుట్టుపక్కల నివాసం ఉంటున్న కుటుం బాలు భయభ్రాంతులకు గురౌతున్నారని తెలిపారు. దీనిపై స్థానిక పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. మండల అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ఆయన కోరారు.

9న అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

ప్రజాశక్తి - సామర్లకోట

పంచాయతీ రాజ్ వ్యవస్థలో అభివృద్ధి ప్రణాళికపై ఈ నెల 9న శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ కాదా హిమామహేశ్వరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ ఉంటుందన్నారు. మండల పరిధిలో పంచాయతీ సెక్రటరీలు, ఎఎన్ఎంలు, డిఎలు, ఎఇలు, మండల స్థాయి అధికారులు సకాలంలో హాజరుకావాలని ఆమె కోరారు.

రోటరీ అధ్యక్షునిగా సత్యనారాయణ

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం - సామర్లకోట రోటరీ క్లబ్ నూతన కమిటీ ఎన్నికైంది. సోమవారం స్థానిక రోటరీ భవనంలో జరిగిన ఎన్నికల్లో నూతన అధ్యక్షునిగా తటవర్తి సత్యనారాయణ, కార్యదర్శిగా అంకం శ్రీనివాస్, రోటరీ సామ్రాజ్య ప్రెసిడెంట్‌గా ఉప్పల సోమరాజు, సెక్రటరీగా బొండా ఆదిత్య ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులతో రోటరీ పూర్వ గవర్నర్ పూషా ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ తుమ్మల దొరబాబు, కెఎస్‌ఆర్‌కె.చౌదరి, డి.గంగాధరుడు, రోటరీ సభ్యులు, విన్నర్ వీల్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణతో ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

కుట్టు శిక్షణతో మహిళలకు ఉపాధి అవకాశాలు ఉంటాయని మహిళా పాలిటెక్నిక్ కళాశాల విశ్రాంతి ఉద్యోగి ఉంగరాల సుభాకర్ అన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రానికి కుట్టు మిషన్‌ను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుట్టు శిక్షణ పొందిన మహిళలు తమ ఇంటి వద్దనే స్వయం ఉపాధి పొందే అవకాశం ఉంటుందన్నారు. ప్రముఖ సాహిత్య వేత్త డాక్టర్ శిరీష మాట్లాడారు.

పాస్‌పోర్టు పోయినది

కాకినాడ జిల్లా, కాకినాడ అర్బన్, డైరీఫాం సెంటర్, సాంబమూర్తి నగర్, ఇందిరా కాలనీ, డోర్ నెం. 16-42-62 కాపురస్తులు కూండ్రపు అప్పన్న గారి కుమారుడు కూండ్రపు జానకి అచ్చుత శివ సత్యన్నారాయణ గారు యావన్మందికి తెలియజేయునది ఏమనగా,

నా యొక్క పాస్‌పోర్టు నెం. **B5397309,** తేది. 16-05-2001 కలది నేను 30-6-2025వ తేదీన జిరాక్స్ నిమిత్తం మా ఇంటి నుండి భానుగుడి జంక్షన్‌లో గల జిరాక్స్ షాపునకు నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు తీసుకుని మోటార్ సైకిల్‌పై వెళ్ళుచుండగా నా యొక్క పాస్‌పోర్టు పడిపోయినది. వెనుకకు వచ్చి ఎంత వెతికిన దొరకలేదు. కావున ఈ పాస్‌పోర్టు దొరికిన ఎడల ఈక్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

కూండ్రపు జానకి అచ్చుత శివ సత్యన్నారాయణ
డోర్ నెం. 16-42-62, సాంబమూర్తి నగర్
ఇందిరా కాలనీ, కాకినాడ అర్బన్
సెల్: 9989102425

మహారాజశ్రీ రామచంద్రపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P. No. 88/2019 in
O.S. No. 633/2012

Between:
పడమటి సత్యనారాయణ చౌదరి ...**DHr**
AND
గున్నం వెంకట మోహన్, S/o. ఆదినారాయణ మూర్తి, హిందూ, 46 సం॥లు, డో.నెం. 79-13-14, శ్యామల నగర్; రాజమహేంద్రవరం, తూ॥గో॥జిల్లా. ...**JDr**

పై నెంబరు E.P. లో JDr అయిన మీకు పై కోర్టు వారి ద్వారా పోస్టులు ద్వారా ఎన్నిసార్లు సేల్ నోటీసులు పంపించిననూ తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నారు. కావున **ది. 21-7-2025వ తేదీన** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, అడ్వకేటు గారి ద్వారా గాని హాజరు అయ్యి మీ ఆక్షేపణలు తెలియపరచుకొనవలెను. లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడును.

రామచంద్రపురం **డి.జగదీశ్వర్లు**
04-7-25 అడ్వకేటు, రామచంద్రపురం